# ప్రేమ చికిత్స

శ్రీ పఠాభి.

మనోరమా నందగోపాల్లు చూస్తూచూస్తూ పట్టపగలే అంధులయి అమాంతంగా జారి ప్రేమలో బడ్డారు............

అలా పడేసరికి, పాపం, వారిద్దరి గుండెలు బ్రద్దలయ్యాయి. పడి మళ్ళా లేవలేకపోయారు. తీవ్రమయిన బాధగావున్నది, వక్షాలు వుబ్బినవి. నిట్టూర్పులు విడుస్తున్నారు. ఇందువల్లన వాళ్ళకి అధికంగా జ్వరం కాయసాగింది, ప్రలాపింపసాగారు కూడానువారు,....

డాక్టర్ బాబువచ్చాడు పరీక్షించుటకు. "స్టతస్కోపు" తగిలించుకొని వారి వక్షాలమీద ఆ యంత్రాన్ని వుంచాడు వీనులు పగిలేట్టు శబ్దంచేస్తున్నా యాపగిలిపోయిన గుండెలు..................

గడ్డాన్ని తడుముకుంటూ డాక్టర్ బాబన్నాడు, "వీరి గుండెలు "ఇంటర్నలు"గా "ఫ్రాక్చ" రయ్యాయి. అందు "కాంపవుండు ఫ్రాక్చరు." చాలా జాగ్రత్తగా "ట్రీట్"చేయాలి. ఆపరేషన్‌కూడా అవసర మనుకుంటాను. అంత దాకా వీళ్ళకు చంద్రకాంతి కనుబడకూడదు, పుష్ప పరిమళములు సోకగూడదు. కోకిళ్ళ గల్భాలేమీ వుండగూడదు. ఈ జబ్బుకు అవి చాలా హానికరం"...............

ఆ ఆపరేషను అనుకున్నంత సులభసాధ్యముగా అగుపింపలేదు. బ్రద్దలయిపోయిన గుండియలకు అతుకులు వేయటానికి వీలుకాలేదు. మరోమనిషి గుండెలోనుండి కొంత భాగాన్ని "ట్రాన్సఫర్"జేసి కుట్టివేస్తామా అంటే, తన గుండెలో అణు మాత్రమేని యివ్వటానికి సిద్ధంగావుండే మానవుడేడి?...........

డాక్టర్ బాబుకు ఓ "బ్రిలియంటు" వూహ తట్టింది........

మనోరమ గుండెకు కావలసిన భాగాన్ని నందగోపాలుని గుండెనుండి, నందగోపాలు గుండెకు కావలసిన భాగాన్ని మనోరమ గుండెనుండీ, "ట్రాన్సఫర్"కేసి కుట్టివేస్తే సరిపోవునను కున్నాడు...............

క్లోరోఫారమునిచ్చి మనోరమ నందగోపాలులను మూర్ఛిల్లజేసాడు. అంత చరచరమంటూ వారివక్షాలనుకోసి యిర్వురి గుండెలను కొంతకొంత యిటూఅటూ మార్చి సర్దివేశాడు. ఆపరేషను జయప్రదంగా జరిగింది...........

రోగులకు కొంత సుస్తిగావుంది. డాక్టర్ బాబు నేర్పువల్ల ప్రాణాపాయం తప్పింది. కానీ యింకా పూర్ణంగా నయంకాలేదు....

వారిబుగ్గ లింకా బూరటిల్లలేదు. కన్ను లింకా లాక్కొనిపోయున్నవి. ముఖంలో కింకా మునుపటి కాంతిరాలేదు........

వారికి సుంతస్పృహరాగానే వారి వక్షాలలో విచిత్రమగు బాధపుట్టింది. అది బాధకానిబాధ, సుఖములాంటి వ్యథ, వారివక్షాలలో ఏవో పక్షులు కదిలినట్లుండేది, డాక్టర్ బాబుకు అర్థంగాక తల గీరుకున్నాడు...........

నందగోపాలునకు మనోరమా నగ్నవక్షాన్ని తన వక్షానికి గట్టిగా అదుముకోవాలని గాఢవాంఛకలిగేది. మనోరమకు నందగోపాలుని విశాలవక్షాన్ని తన వక్షానికి అదుముకోవాలనని గాఢవాంఛ పుట్టేది........ ........

డాక్టర్ బాబు కారణం గ్రహించాడు. అన్నాడు "ఆరోగ్య రీత్యా మనిషీ మనిషి ఆనుకోనియుండరాదు. అందుట్లో కవుగులించుకోటం అసలే పనికిరాదు. ఓ మనిషి నిశ్వాసవాయువులు మరో మనిషికి ఉచ్ఛ్వాస వాయువులయి చాలా ఉపద్రవం కలుగజేయును. శ్వాసకోశాలు విషసిక్త మయిపోవునుకూడా. కానీ ఈ జబ్బుకు మట్టుకు అధి ఫరవాలేదు మీదు మిక్కిలి వారి ఆరోగ్యానికి చాలా అవసరంకూడాను. మనోరమా నిశ్వాసవాయువులు నందగోపాలునికిపోయి, వాని గుండెలోవున్న మనోరమా భాగదామాషా గుండెను బలఫరుపగలవు. నందగోపాలుని నిశ్వాసవాయువులు మనోరమలోనికిపోయి. ఆమె గుండెలోవున్న నందగోపాలుని భాగదామాషా గుండెను బలపరుపగలవు"..........

మనోరమా నందగోపాల్ల ఆనందానికి మేరలేదు. డాక్టర్ బాబునకు తమ సహస్రకోటి ధన్యవాదాల సమర్పించారు..........

తాము పత్యమేమన్నా వుండవలయునా అని అడిగారు. డాక్టరన్నాడు "దీనికి ప్రత్యేకంగా పత్యమేమీలేదు. కాని మీరు చాలా జాగ్రతగా వుండాలి సుమ, మీరిర్యురు అన్యోనంగా "నర్సు" చేసుకుంటూండండి. నందగోపాలా! సాయత్రం అయితే నీవు ఇల్లువిడచిపోతే మంచిది కాదు. వకేపాన్పుమీద పవ్వళిస్తూ పరస్పర సహాయవంతంగా వుంటే మీకు చాలా మంచిది."........

"ఏమండి డాక్టర్ బాబూ! మాకేమన్నా టానిక్ ఇస్తే బావుంటుంది కదండి" అని వారడిగినారు.

"ఆ! టానిక్ ఎందుకు మనోరమ ఆధరరసాన్ని నందగోపాలూ, నందగోపాలు అధర రసాన్ని మనోరమాదినానికి కనీసం ఓసారయిన పడుకోబోయే ముందు నోటినిండా పీలిస్తే, దానికి మించిన టానిక్ లేనేలేదు. మరీ! నేనిచ్చిన ఈ పలహాలను మరచిపోకుండా పాటించండి. పాటించకుంటే విచారంలో పడ్తారు మీరు. కష్టాల్లో కూడా పడవచ్చు. ప్రేమలోపడ్తే చికిత్స చేస్తానే గాని, విచారంలో పడ్తే, నేనేమి చేయలేను సుమా. తర్వాత నన్నుకోని లాభంలేదు."